

గ్రామపంచాయతీ ఉద్యోగులకు గ్రీన్‌చాలన్ ద్వారా వేతనాలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలలో చిరు ఉద్యోగులుగా పని చేస్తున్న వారికి గ్రీన్‌చాలన్ ద్వారా వేతనాలు ఇవ్వడానికి ప్రభుత్వం ఆమోదించినట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నకోటి వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రీన్ చాలన్ ద్వారా నెల నెలా వేతనాలు చెల్లించేందుకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్న 51 జీవోను కూడా సవరించి న్యాయం చేయాలన్నారు.

● ఫటాఫట్

రాజీవ్ యువ వికాసం పథకానికి భారీ స్పందన

కొప్పుల శ్రీనివాస్, ఎంపీడీవో



ఆంధ్రజ్యోతి: మండలంలో యువ వికాస పథకానికి ఎన్ని దరఖాస్తులు వచ్చాయి ?

ఎంపీడీవో: మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో 2200 పైగా దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి: ఎక్కువ ఎలాంటి యూనిట్‌లకు దరఖాస్తు చేసుకున్నారు

ఎంపీడీవో: అగ్రికల్చర్, డీటిపి- జిరాక్స్ సెంటర్, బ్యూటీపార్లర్, గొర్రెల యూనిట్, ఆటో, కుల వృత్తులకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయి.

ఆంధ్రజ్యోతి : దరఖాస్తుల పరిశీలన ఎప్పటి వరకు పూర్తి చేస్తారు ?

ఎంపీడీవో : ఈనెల 30వ తేదీ లోపు దరఖాస్తుల పరిశీలన చేస్తాం. బ్యాంకర్‌లతో సమావేశం నిర్వహిస్తాం.

ఆంధ్రజ్యోతి : దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారా ?

ఎంపీడీవో : దరఖాస్తుదారులను గ్రామాల వారిగా క్లస్టర్‌లను ఏర్పాటు చేసి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాం. ఇందులో బ్యాంకర్లు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేకాధికారుల సమన్వయంతో చేపడుతాం.

- పెద్దపల్లి రూరల్

అరుగాలం కష్టం.. వర్షార్పణం

- పలు మండలాల్లో కురిసిన వడగళ్ల వాన
- నేలరాలిన వరి, మామిడి కాయలు
- భారీ ఈదురుగాలులకు విరిగిపడిన విద్యుత్ స్తంభాలు
- జిల్లాలో 2742 ఎకరాల్లో వరి, 119 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం

ఆరుగాలం శ్రమ నీటిపాలైంది... మంగళవారం రాత్రి ఓదెల, కాల్వశ్రీరాంపూర్, మంథని, ముత్తారం మండలాల్లో భారీ ఈదురుగాలులు, వడగండ్ల వాన కురిసింది. దీంతో వరి గింజలు, మామిడి కాయలు నేలరాలాయి. కోతకు వచ్చిన సాధారణ వరి పంటతోపాటు విత్తనోత్పత్తి కోసం పండించిన పంట పూర్తిగా దెబ్బతిన్నది. ముత్తారం మండలంలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి.



మంథని మండలం చిన్నఓదాలలో నేలవాలిన వరిపంట

ముత్తారం మండలంలో ఇంటిపైన పడ్డ విద్యుత్ స్తంభం

మంథనిరూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కష్టించి పండించిన పంట చేతికందే సమయంలో అకాల వర్షానికి దెబ్బతినడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల్లో కోతలు కోయాల్సిన వరి పంట నేలరాలి గింజలు రాలిపోవడంతో రైతులు ఆవేదనకు గురవుతున్నారు. మండలంలో సుమారు 20 ఎకరాల్లో యాసంగి వరి పంటను సాగు చేశారు. మండలంలోని చిన్నఓదాల, గోపాల్‌పూర్ ప్రాంతాల్లో మంగళవారం రాత్రి గాలి దుమారంతో వర్షం కురియడంతో వరి పంట పెద్దఎత్తున నేలవాలగా మరి కొన్ని చోట్ల వరి గింజలు రాలిపోయాయి. దీంతో రైతులు ఆందోళన చెంద తున్నారు అకాల వర్షం, గాలి దుమారం కారణంగా లక్కెపూర్, తోటగోపయ్యపల్లి, ఎక్లాస్‌పూర్, సూరయ్యపల్లి ప్రాంతాల్లో వరి పంట కొంత నేలవాలిపోగా కొద్ది రోజుల క్రితం ఎక్లాస్‌పూర్, పుట్టపాక, గంగాపురి, మంథని ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభం కాగా ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించగా అకాల వర్షంతో ఆరబెట్టిన ధాన్యం తడిసిపో యింది. తడిచిన ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాల్లో ఆర బెట్టారు. మరో రెండు రోజులు వాతావరణంలో మార్పుల కారణంగా వర్షం పడే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



కాల్వశ్రీరాంపూర్ మండలంలో రాలిన మామిడికాయలు చూపుతున్న రైతులు

● **వడగళ్ల వానతో తీవ్ర నష్టం**

ముత్తారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వడగళ్ల వర్షం తీవ్ర నష్టం మిగిల్చింది. సుమారుగా 2000 ఎకరాల్లో వరి, 60 ఎకరాల్లో మామిడి పంట నష్టం వాటిల్లిందని మండల వ్యవసాయ అధికారి అనూష తెలిపారు. సందర్బంగా వారు మాట్లాడుతూ మంగళవారం రాత్రి కురిసిన రాళ్లవానకు మండలంలో వరి, మామిడి పంటలకు నష్టం వాటిల్లిందని, నష్టం అంచనా వేసి నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు పంపించనున్నట్లు తెలిపారు. రాళ్లవానకు మామిడికాయలు నేలపాలయ్యాయి. గతంలో వందల ఎకరాలు మామిడి సాగు జరిగేదని, సరైన దిగుబడి లేక రైతులకు ఆదాయం రాకపోవడంతో పలు గ్రామాల్లో మామిడి తోటలను తీసివేసి సీడ్ వరి సాగును చేసున్నారు.అరకొరగా ఉన్న మామిడితోటలకు భారీ నష్టం వాటిల్లింది.

● **11 విద్యుత్ స్తంభాలు నేలమట్టం...**

ముత్తారం మండల కేంద్రంలో ఈదురు గాలులకు 11 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మండల కేంద్రంలో మంగళవారం రాత్రి 10 గంటల నుంచి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. బుధవారం మూడు గంటల వరకు విద్యుత్ అధికారులు సిబ్బంది మరమ్మతు చేసి సరఫరాను పునరుద్ధరించారు.

● **కన్నీటిని మిగిల్చిన వడగండ్ల వాన**

ఓదెల ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వడగండ్ల వాన,గాలి దుమారం మండలంలోని ఎనిమిది గ్రామాల రైతులకు

(మిగతా 8వ పేజీలో)

జిల్లాలో పంట నష్టం ఇలా...

పెద్దపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి తర్వాత కురిసిన వడగళ్ల వాన రైతుల పుట్టి ముంచింది. మరో వారం రోజులు గడిస్తే పంట చేతికి వచ్చే సమయంలో కురిసిన వాన రైతుల నోటి కాడి బుక్కను లాక్కున్నట్లయ్యింది. యేటా యాసంగి సీజన్‌లో కురుస్తున్న అకాల, వడగళ్ల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలో మంగళవారం రాత్రి కురిసిన వడగళ్ల వర్షానికి 2855 ఎకరాల్లో వరి, మామిడి పంటలు దెబ్బతిని 1451 మంది రైతులు నష్టపోయారు. ఇందులో వరి 2742 ఎకరాల్లో, మామిడి 113 ఎకరాల్లో దెబ్బతిన్నది. ఓదెల మండలం ఇందుర్తిలో 92 ఎకరాలు, గూడెంలో 55 ఎకరాలు, పొత్కపల్లిలో 160 ఎకరాలు, శానగొండలో 190 ఎకరాలు, ముత్తారం మండలం ఓడేడులో 1030, అడవి శ్రీరాంపూర్‌లో 1215 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నది. కోతకు వచ్చిన సాధారణ వరి పంటతోపాటు విత్తనోత్పత్తి కోసం పండించిన పంట పూర్తిగా దెబ్బతిన్నదని రైతులు చెబుతున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం రాతుపల్లిలో 25 ఎకరాలు, కాల్వశ్రీరాంపూర్‌లో 10, ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్‌లో 20, మంథని మండలం శాత్రాజులపల్లిలో 15, గుంజపడుగులో 25, నాగారంలో 10 ఎకరాలు, విలోచవ రంలో 8 ఎకరాల్లో మామిడి పంట దెబ్బతిన్నదని, మామిడి కాయలు నేల రాలా యని జిల్లా వ్యవసాయ శాఖాధికారి దోమ ఆదిరెడ్డి తెలిపారు. పంట నష్టపో యిన తమకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు.

డీఎంఎఫ్‌టీ నిధులు ఇప్పించండి

● ఉప ముఖ్యమంత్రికి కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేల వినతి



మంత్రి భట్టి విక్రమార్కతో మాట్లాడుతున్న కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు

గోదావరిఖని, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): కోల్‌బెల్ట్ ప్రాంత అభివృద్ధికి డీఎంఎఫ్‌టీ నిధులు విడుదల చేయాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర గనులు, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్కను బుధవారం కలిసి విజ్ఞప్తి చేసినట్టు రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ తెలిపారు. కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు మంత్రిని కలిసి డీఎంఎఫ్‌టీ నిధుల విడుదలపై చర్చించామన్నారు. కోల్‌బెల్ట్ ప్రాంతంలో మైనింగ్ కారణంగా ప్రజల ఆరోగ్యం, జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, ప్రజలకు మౌలిక సదుపాయలు, మంచినీటి సరఫరా, రహదారులు, ఆరోగ్య శిబిరాలు, వైద్య సదుపాయలు కల్పించేందుకు డీఎంఎఫ్‌టీ నిధులు కీలకమన్నారు. డీఎంఎఫ్‌టీ నిధులు వెంటనే విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలని కోరామన్నారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని, సంబంధిత శాఖ అధికారులతో చర్చించి త్వరితగతిన నిధులు విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారన్నారు.

ధాన్యం కొనుగోలుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు

పెద్దపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాణ్యమైన పంటను మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తున్నామని, సన్నరకం ధాన్యానికి క్వింటాల్ 500 రూపాయల బోనస్ అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఐకెపి, ప్యాక్స్ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు గోనే సంచులు, లారీల ట్రాన్స్‌పోర్టు విషయంలో ఇబ్బందులు ఉన్నా 7995050780 ఫోన్ నెంబర్‌కు కాల్ చేయాలని కలెక్టర్ తెలిపారు. కొనుగోలు ప్రక్రియను కంట్రోల్ రూమ్ నిరంతరం పర్యవేక్షిస్తుందని, రైతులకు ధాన్యం కొనుగోలులో ఎటువంటి సమస్యలు ఉన్న కంట్రోల్ రూమ్ నెంబర్ 08728-224045కు ఫోన్ చేయాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలి

సుల్తానాబాద్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, కేంద్రాలకు వస్తున్న నాణ్యమైన ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేస్తూ వెంట వెంటనే రైస్‌మిల్లులకు తరలించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. సుల్తానాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. యార్డు ఆవరణలో కుప్పలుగా పోసి ఉన్న ధాన్యం నిల్వలను కలెక్టర్ పరిశీలించి అధికారులచే మాయిశ్చర్ పరీక్షలు చేయించారు. అనంతరం కలెక్టర్ అధికారులు, మిల్లర్లు, రైతులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులతో మాట్లాడుతు ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, 24 గంటల పాటు కొనుగోళ్ల ప్రక్రియ జరగాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో రైతులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, కేంద్రాల వద్ద అవసరమైన పాలిథిన్ కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. నిబంధనల మేరకు తేమ శాతం, తాలు లేకుండా ప్యాడీ క్లీనర్ ద్వారా శుభ్రం చేయాలన్నారు. హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలని, వెంట వెంటనే మిల్లులకు ధాన్యం తరలించేందుకు లారీలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు అలాట్ చేసిన మిల్లులకు మాత్రమే ధాన్యం తరలించాలన్నారు. కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే ధాన్యం నాణ్యతగా ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్ 2300 రూపాయలు చెల్లిస్తామన్నారు. సీరియల్ నంబర్ ప్రకారంగా కొనుగోలు చేయాలన్నారు. అదనపు కలెక్టర్ వేణు, జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శ్రీకాంత్, జిల్లా పౌర సరఫరా సంస్థ అధికారి రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ రావు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, జిల్లా రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, విజయపాల్ రెడ్డి, తహసీల్దార్ రాంచంద్రారావు, డిప్యూటీ తహసీల్దార్ రమేష్, సీఈఓ సంతోష్ పాల్గొన్నారు.



సుల్తానాబాద్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ తనిఖీలు

రైతులకు పరిహారం చెల్లించాలి



దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి

ఓదెల ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 8 గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షం రైతులకు భారీ నష్టం వాటిల్లిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, అధికంగా రైతులు సీడ్ పంటలను కోల్పోవడంతో నష్టం వచ్చిందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో వివిధ సీడ్ కంపెనీల అర్గనైజర్లు చెల్లించినట్లు, ఇక్కడ కూడా ఎక రానికి రూ.50 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పంట చేతికి అందే సమయంలో గింజ మొత్తం నేలరాలిందన్నారు. ఓదెల మండలంలో దాదాపు 450 ఎకరా ల్లో పంటలు దెబ్బతిన్నాయని, వెంటనే ఓదెల, జూలపల్లి మండలాల రైతులకు పంట నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. దాత రాకేష్, పుల్లూరి పృథ్వి, ఎర్రవెల్లి అనిల్, భూషనవేని సత్యం, కొండపాక నరసింహ చారి, పులి కొమురయ్య, సాయికృష్ణ, రవీందర్, భిక్షపతి తో పాటు పలువురు పాల్గొన్నారు.

పెంపకానికి ఆరు రోజుల శిశువు

జయశంకర్ జిల్లా వాసికి ఇచ్చిన మహారాష్ట్ర దంపతులు

శిశువుకు అనారోగ్యంతో గోదావరిఖని ఆసుపత్రికి

అనుమానంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన ఆసుపత్రి వర్గాలు...

శిశువు సంరక్షణ చేపట్టిన ఐసీపీఎస్

6

వైద్య కళాశాలకు పార్థివదేహం అప్పగింత

6

'భూ భారతి'పై నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు

పెద్దపల్లి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకవచ్చిన భూ భారతి ఆర్వోఆర్ చట్టంపై ఈ నెల 17 నుంచి 28వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ నెల 17న ఉదయం 10 గంటలకు అంతర్గాం మండలంలోని బ్రాహ్మణపల్లి రైతు వేదిక వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు రామగుండం మండలంలోని ఎన్టీపీసీ మిలీనియం హాల్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నారు. 19న ఉద యం 10 గంటలకు ధర్మారం మండలం నందిమేడారం రైతు వేదిక వద్ద, 21న ఉద యం 10 గంటలకు ఎలిగేడు మండలంలోని రైతు వేదిక వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు జూలపల్లి మండలంలోని గోల్డెన్ ఫంక్షన్ హాల్ వద్ద కార్యక్రమం జరగనున్నది.

అలాగే 22న ఉదయం 10 గంటలకు సెంటినరీకాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్ వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు కమాన్‌పూర్ మండలంలోని నాగారం రైతు వేదిక వద్ద, 23న ఉదయం 10 గంటలకు మంథని మండలంలోని నాగారం రైతు వేదిక వద్ద, 24న ఉదయం 10 గంటలకు ఓదెల మండలంలోని రైతు వేదిక వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు ముత్తారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయం, 25న ఉదయం 10 గంటలకు పాలకుర్తి మండలంలోని రైతువేదిక వద్ద, మధ్యాహ్నం 2 గంటలకు కాల్వశ్రీరాంపూర్ మండలంలోని రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద, 26న ఉదయం 10 గంటలకు సుల్తానాబాద్ మండలంలోని సుద్దాల రైతువేదిక వద్ద, 27న ఉదయం 10 గంటలకు పెద్దపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి రైతువేదిక వద్ద అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ పేర్కొన్నారు.

చెరువుల మట్టిపై కన్ను..

- జిల్లాలో 14 చెరువులను గుర్తించిన అధికారులు
- కొత్తగా మట్టి పాలసీని తీసుక వచ్చిన కలెక్టర్
- నిఘా లేకుంటే ప్రభుత్వానికి భారీగా పడనున్న గండి

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మట్టి మాఫియా, ఇటుక బట్టీల యజమానుల కన్ను చెరువుల మట్టిపై పడింది. ఇటుకల తయారీ కోసం కావాల్సిన మట్టిని ఆయా చెరువుల నుంచి తరలించేందుకు అనుమతుల కోసం అప్పుడే ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటి వరకు పెద్దపల్లి డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో 14 చెరువుల్లో 3 లక్షల 8 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించేందుకు అవకాశం ఉందని, అందులో అనుమతులు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా చెరువుల్లో నీళ్లు తగ్గిన తర్వాత అనుమతులు ఇవ్వాలని భావిస్తున్నారు.

మట్టి మాఫియా, ఇటుక బట్టీల యజమానులు యేటా తక్కువ పరిమాణంలో అనుమతులు తీసు కుని పెద్ద ఎత్తున మట్టిని తోడుకు పోయి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. జారీ చేసిన వే బిల్లుల ప్రకారమే మట్టిని పొద్దంతా తరలించాలనే నిబంధనలు ఉన్నప్పటికీ, అందుకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నారు. దీనిపై పకడ్బందీగా నిఘా పెట్టాల్సిన ఆయా శాఖల అధికారులు అందిన కాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది కూడా మట్టి మాఫియా, ఇటుక బట్టీల యజ మానులు అనుమతులు పొందేందుకు ప్రయ త్నాలు మొదలుపెట్టారు. వే బిల్ లేకుండా మట్టిని తరలించకుండా ఉండేందుకు కలెక్టర్ కోయ శ్రీహర్ష మట్టి పాలసీని తీసుక వచ్చారు. మట్టి తరలింపునకు తహసీల్దార్లు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. నీటి పారుదల, గనులు, భూగర్భ శాఖాధికారులు సూచించిన మేరకు మాత్రమే మట్టిని తీసుక వెళ్లేందుకు అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి వాహనం వే బిల్లుతో వెళ్లే విధంగా రెవెన్యూ శాఖాధికారులు, పోలీసుల సహకారంతో పని చేయనున్నారు. వే బిల్లులను తహసీల్దార్లు జారీ చేయనున్నారు. సీనరేజీ డబ్బులు మాత్రం గనులు, భూగర్భ శాఖకు చెల్లించాల్సి ఉంటుంది. ఏ చెరువు నుంచి ఎక్కడికి మట్టిని తరలిస్తున్నారనే వివరాలను వే బిల్లులో పేర్కొనాలని, ఒక స్థలం రాసి, మరో చోటికి తరలిస్తే చర్యలు తీసుకోనున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే మట్టిని తరలించాలని, ఆ తర్వాత మట్టిని తరలిస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.





● **గత ఏడాది నిబంధనలు అతిక్రమించి..**

గత ఏడాది ఎల్లంపల్లి ప్రాజెక్టులో ముంపునకు గురైన ముర్మూరు చెరువు నుంచి నల్ల మట్టిని తీసుక వెళ్లేందుకు అనుమతులు పొందిన పలువురు ఇటుక బట్టీల యజమానులు నిబంధనలను అతిక్రమించి రాత్రింబవళ్లు మట్టిని తోడి ఒక చోట

(మిగతా 8వ పేజీలో)

తండ్రిని చితకబాదిన కొడుకుపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పొలం అమ్మగా వచ్చిన డబ్బులను తనకు ఇవ్వాలని కన్న తండ్రిని చితకబాదిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లికి చెందిన వేముల రాజుపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ బుధవారం తెలిపారు. గ్రామంలోని వేముల సత్తయ్య అతని కొడుకు రాజుతో కలిసి జీవిస్తున్నాడని పేర్కొన్నారు. మూడేళ్ల కిందట సత్తయ్య పేరిటఉన్న పొలాన్ని అమ్మగా రూ.18 లక్షలు వచ్చాయని చెప్పారు. ఆ డబ్బులు నుంచి సత్తయ్య తన కొడుకు రాజుకు రూ.12లక్షలు ముట్ట చెప్పాడని పేర్కొన్నారు. ఈనెల 15న మిగిలిన డబ్బులు తనకు ఇవ్వాలని తండ్రి సత్తయ్యతో గొడవకు దిగాడని, అంతటితో ఆగని రాజు బండరాయితో దాడి చేశాడని పేర్కొన్నారు. తీవ్ర గాయాలపాలైన సత్తయ్యను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని చెప్పారు. బాధితుడి కూతురు పిట్టల రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్సై రమాకాంత్ వివరించారు.

కొడుకు తిండి పెట్టడం లేదు..

● తహసీల్దార్‌కు మొరపెట్టుకున్న మాజీఎంపీటీసీ

శంకరపట్నం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): తాను కష్టపడి సంపాదించిన భూమి సాగు చేసుకుంటూ.. తాను నిర్మించిన ఇంట్లో ఉంటూ తనకు కనీసం తిండి పెట్టడంకుండా తన కొడుకు ఇబ్బందులు పెడుతున్నాడని రాజాపూర్ మాజీ ఎంపీటీసీ ఆసరి అయిలయ్య శంకరపట్నం తహసీల్దార్‌కు బుధవారం గోడువెల్లబోసుకున్నాడు. ఈ సందర్భంగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను సంపాదించిన భూమి, ఇంటిని తిరిగి ఇప్పించాలని వేడుకున్నారు. కాగా ఆసరి అయిలయ్య స్థితిగతులు తెలుసుకున్న తహసీల్దార్ భాస్కర్ గ్రామంలో విచారణ చేయాలని ఆర్ఐ బాలకిషన్‌ను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జమ్మికుంట, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులో ట్రాక్టర్, బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పద్మశాలి వీధికి చెందిన పెరుమాండ్ల సుధాకర్ బైక్‌పై దినేష్ ఫంక్షన్‌హాల్‌లో ఓ శుభ కార్యానికి హాజరై జమ్మికుంట వైపు వస్తున్నాడు. అదేరోడ్డులో ట్రాక్టర్ (టిఎస్ 022 7910) మక్కల లోడుతో వేగంగా వస్తోంది. ట్రాక్టర్‌ను ఓవర్‌టెక్ చేసే క్రమంలో ట్రాక్టర్ ముందు భాగం బైక్‌కు తగిలింది. దీంతో బైక్‌పైనున్న సుధాకర్ కింద పడిపో యాడు. ట్రాక్టర్ ముందు బైక్‌పైకి ఎక్కడంతో లోడుతో ఉన్న ట్రాక్టర్ వెనుకభాగం బోల్తాప డింది. ఈ ప్రమాదంలో సుధాకర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన అతన్ని ఆసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

● ఎండల వేళ పశువులు జాగ్రత్త

● వడదెబ్బ నుంచి రక్షణ కల్పించాలి



పాడి రైతులు పారాహుషార్

చొప్పదండి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వేసవిలో మనుషులే కాదు మూగజీవాలు కూడా వడదెబ్బకు గురవుతుంటాయి. ఎండల వేళ పశుపోషణలో మెళకువలు పాటించకపోతే వాటి ప్రాణానికి ప్రమాదమే. యజమానులకు నష్టమే మిగులుతుంది. అధిక ఉష్ణోగ్రతలు, గాలి ప్రసరణ సరిగా లేకపోవడం, పశువుల పాకల్లో అధిక సంఖ్యలో జీవాలను కిక్కిరిసి ఉంచడం, నీళ్లు అందుబాటులో లేకపోవడం వల్ల పశువులు, గొర్రెలు, మేకలు వడ దెబ్బకు గురవుతాయి. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి బలహీనంగా మారుతాయి. వాటి చర్మం పొడిబారుతుంది. పశువుల సరిగ్గా నడవలేక తూలుతూ ఉంటాయి. జీవక్రియ తగ్గిపోయి ఆకలి మందగిస్తుంది. దీంతో ఆహారం తక్కువగా తీసుకుంటాయి. పశువులు ఎదకు రాకపోగా చూడికట్టే అవకాశాలు తగ్గిపోతాయి. రోగనిరోధక శక్తి తగ్గడం వల్ల ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. ఎండ వేడిమికి దాణా సరిగా తినకపోవడం మూలంగా పాల దిగుబడి తగ్గిపోతుంది. ఎండ నుంచి పశువులను రక్షించుకుంటేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది.

పాకల్లో చల్లదనం కోసం ఏర్పాట్లు

పశువుల పాకల్లో పైకప్పులకు తెల్లరంగు వేసి ఆపై గడ్డి, తాటి, కొబ్బరి వంటి ఆకులను పరచడం లాంటి చర్యల ద్వారా ఎండ వేడి షెడ్లలోకి ఎక్కువగా ప్రవేశించకుండా చూడవచ్చు. మధ్యాహ్న సమయంలో పాకల చుట్టూ గోతాలు, పరదాలు వేలాడదీసి వాటిని తరచు నీటితో తడపడం మంచిది. అత్యధిక పాలిచ్చే సంకరజాతి ఆవులు, ముర్రా గేదెలకు ఫ్యాన్లు ఏర్పాటు చేయడం ఎంతో అవసరం. పశువుల పాకలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గాలి ధారాళంగా ప్రసరించే విధంగా చూడాలి. పశువులను రోజుకు రెండు మూడు సార్లు చల్లని నీటితో కడగాలి.



మెళకువలు పాటించాలి

వేసవిలో పశువులకు అందించే మేత, దాణాలో మెళకువలు పాటిస్తేనే పాడి పోషణ లాభదాయకంగా ఉంటుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో మేతకు తీసుకెళ్లాలి. వేసవి తాపంతో పశువుల్లో జీర్ణక్రియ మందగిస్తుంది. అందువల్ల సులువుగా జీర్ణించుకునే పిండి పదార్థాలైన గంజి, జావ వంటివి అందించాలి. ఎక్కువశాతం పచ్చిగడ్డి అందించాలి. పచ్చిగడ్డిని ఉదయం, ఎండు గడ్డిని రాత్రి సమయాల్లో కత్తిరించి ఇవ్వాలి. అధిక పాలు ఇచ్చే పశువులకు దాణాతో నీటిని కలిపి ఇవ్వాలి. మినరల్ మిక్చర్, ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మరీ మంచిది. అలాగే వేసవిలో పశువుల్లో తాగునీటి అవసరాలు రెట్టింపవుతాయి. చల్లని శుభ్రమైన నీటిని పశువులకు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలి. నీటి తొట్లను నీడలో ఉంచాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ నీళ్లు తాగేలా చూడాలి.

పశువుల్లో వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బకు గురైన పశువుల్లో నాలుక బయట పెట్టడం, నీరు తాగకపోవడం, మేత తినకపోవడం, మూత్ర విసర్జన ఆగిపోవడం లాంటి లక్షణాలు కలిపిస్తాయి. కళ్లలో ఎర్రటి చారలు, నెమరు వేయలేకపోవడం తదితర లక్షణాలు ఉంటాయి. ఈ లక్షణాలు పశువుల్లో కనిపించిన వెంటనే ఉప్పు, బెల్లం కలిపిన ద్రావణం తాగించాలి. నిత్యం నాలుగైదు సార్లు చల్లని తాగునీటిని అందించాలి. రైతులు వెంటనే పశు వైద్యుడిని సంప్రదించి చికిత్స అందించాలి.

వాహనాలను సీజ్ చేసిన అధికారులు

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం షానగర్ ఎల్లమ్మ చెరువులో చేపడుతున్న తవ్వకాలను ఇరిగేషన్ అధికారులు నిలిపివేశారు. ఇష్టారాజ్యంగా మట్టి తరలింపు అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కాగా ఇరిగేషన్ అధికారులు స్పందించారు. ఈఈ సుధాకర్ ఆదేశాలతో ఏఈ రఘురామ్ ఇతర సిబ్బందితో ఎల్లమ్మ చెరువుకు తరలవచ్చి వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మూడు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఫిర్యాదు చేసినట్లు ఏఈ రఘురాం తెలిపారు. పరిమితికి మించి ఎక్కువగా తీసిన తవ్వకాలపై ఫైన్ వేసినట్లు ఆయన వివరించారు.



పట్టుకున్న వాహనాలతో ఏఈ

కోతకు వచ్చిన ఆయిల్ పామ్ గెలలు

● మొదటి కాత మూడు టన్నుల దిగుబడి

మానకొండూర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేగురుపల్లి గ్రామానికి చెందిన నందిగొండ ముత్తారెడ్డి అనేరైతు తనకున్న 5.30 ఎకరాలలో ఆయిల్‌పామ్ సాగు చేశారు. మూడేళ్ల రెండు నెలలకు గెలలు పక్వానికివచ్చి మొదటి సారి కోతకు వచ్చింది. ఒప్పందంలో భాగంగా మొక్కలను అందించిన లోహియా ఎడిబిల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు కొనుగోలుచేశారు. మొదటిసారి మూడు టన్నుల దిగుబడిరాగా టన్నుకు రూ.21వేల ధర పలికింది. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రోత్సహకాలు అందజేసి ప్రతిష్టాత్మకంగా ఆయిల్‌పామ్ పంటను సాగుచేయిగా చేతికి వచ్చిన పంటను సంస్థ కొనుగోలు చేయడం సంతోషదాయకమని రైతు ముత్తారెడ్డి తెలిపారు. దిగుబడి క్రమంగా పెరుగుతుందని రైతు తెలిపాడు. కూలీల ఖర్చు లేకుండా ఇతర పంటలకు ప్రత్యామ్నాంగా ఆయిల్ పామ్ పంటను సాగు చేయడం లాభదాయకంగా ఉంటుందన్నారు. గెలలను కొనుగోలుచేసిన వారం రోజులకు రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్లు సంస్థ మేనేజర్ కే. విజయభరత్ తెలిపారు.



ఆయిల్ పామ్ గెలలతో రైతులు, సంస్థ ప్రతినిధులు

మెడికల్ కాలేజీకి మృతదేహం అప్పగింత

ఓదెల ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూర్‌కు చెందిన జిగురు ఓదెలు అనారోగ్యంతో మృతిచెందాడు. బుధవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రతిమమెడికల్‌కళాశాలకు పార్థివదేహాన్ని కుటుంబ సభ్యులు అప్పగించారు. మృతుడికోరిక మేరకు కుటుంబ సభ్యులంతా మృతదేహాన్ని అప్పగించేందుకు నిర్ణయించుకోగా కొలనూర్‌లో సదాశయ ఫౌండేషన్, సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యకళాశాలకు అప్పగించారు. గతంలో జిగురు ఓదెలు, అతడి భార్య కనకలక్ష్మీ దేహదానానికి అంగీకరించారు. ఈ నిర్ణయాన్ని ఆచరణలో పెట్టడం పలువురికి స్ఫూర్తిదాయకమని సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి భీష్మచారి తెలిపారు. అలాగే వైద్యకళాశాలకు మృతదేహాన్ని దానం చేయడంపై కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, బహుభాష కోవిదుడు నలిమెల భాస్కర్, వైద్య కళాశాల డీన్, సీఈవోలు, సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.



ప్రతిమ వైద్యకళాశాలకు మృతదేహాన్ని అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

గిన్నిస్ బుక్ రికార్డు సాధించిన విద్యార్థి

జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని సెయింట్ జోసఫ్ హైస్కూల్‌లో 9వతరగతి చదువుతున్న జోయల్ మెక్ పియానో వాయించడం పోటీల్లో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించాడు. 2024డిసెంబర్ 1న నిర్వహించిన ప్రపంచస్థాయి మ్యూజిక్ ప్రదర్శనల్లో కీబోర్డు సంగీత కళాకారుల బృందం ఒకగంటలో 1046వీడియోలు అప్‌లోడ్‌చేసి ప్రపంచ రికార్డుసాధించింది. ఈ బృందంలో జోయల్‌మెక్ ఉన్నాడు. పాఠశాల కరస్పాండెంట్ వై సునీల్‌కుమార్ విద్యార్థిని అభినందించాడు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే గిన్నిస్‌రికార్డులో చోటు సంపాదించుకున్నానని విద్యార్థి తెలిపాడు.



మెక్‌ను అభినందిస్తున్న కరస్పాండెంట్ సునీల్ కుమార్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలోని కునారం రోడ్డువద్ద బుధవారం జరిగినరోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. చీకురాయి రోడ్డుకుచెందిన నాగులమల్యాల రాజేశం (59) ఉదయ్‌నగర్ నుంచి బస్టాండ్‌వైపు మోపెడ్‌పై వెళుతున్నాడు. రాజీవ్‌రహదారి పైకి వచ్చే క్రమంలో వెనుకనుంచి వచ్చిన లారీ(టీజీ35 టీ 1125) ఢీకొట్టింది. దీంతో మోపెడ్‌పైనుంచి కిందపడిన రాజేశం తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులుహుటాహుటిన ప్రభుత్వాస్పత్రికి తరలించేలోపే రాజేశం మృతిచెందాడు. పోలీసులు లారీని పోలీస్‌స్టేషన్ తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



రాజేశం (ఫైల్)

ప్రభుత్వ ఉద్యోగం సాధించలేకపోయానని యువతి ఆత్మహత్య

కోల్‌సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం సాధించ లేకపోయాననే మనస్తాపంతో పెద్దపల్లిజిల్లా గోదావరిఖని పవర్ హౌస్‌కాలనీకి చెందిన చుంచు ప్రత్యూష(26) అనే యువతి మంగళ వారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ప్రత్యూష తండ్రి విఠల్ గోదావరిఖని బస్టాండ్ సమీపంలో టీస్టాల్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ముగ్గురు కూతుర్లు కాగా, ఇద్దరు కూతుర్లకు వివా హం జరిపించాడు. చిన్న కూతురు ప్రత్యూష పీజీ చదివి పలు పోటీపరీక్షలకు హాజరవుతోంది. ఉద్యోగం సాధించ లేకపోయాననే మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు యువతితండ్రి విఠల్ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ భూమేష్ పేర్కొన్నారు.



ప్రత్యూష(ఫైల్)

మద్యానికి బానిసై ఒకరి బలవన్మరణం

రామడుగు, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఒంటరి జీవితంతో వేగలేక మద్యానికి బానిసై జీవితంమీద విరక్తిచెందిన ఓవ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రామడుగులో జరిగింది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. రామడుగు మండల కేంద్రానికి చెందిన కావలి భూమయ్య(55) 25సంవత్సరాలుగా భార్యాపిల్లలకు దూరమై ఒంటరిగాతల్లితో ఉంటున్నాడు. నాలుగుసంవత్సరాల క్రితం తల్లి సైతం వృద్ధాప్యంతో మృతిచెందగా ఒంటరివాడైన భూమయ్య మద్యానికి బానిస అయ్యాడు. జీవితం విరక్తి చెందిన ఆయన 15వ తేదీన సాయంత్రం బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. 16న ఉదయం తాటివనంలో చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుసుకున్న బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి అన్న కొడుకు కావలి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

ముఖ్యమంత్రిని కించపరిచిన కేసులో..

● నిందితుడిని విచారించిన గోదావరిఖని సైబర్‌క్రైమ్ పోలీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రిని, ప్రభుత్వాన్ని కించపరుస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన కేసులో నల్ల బాలు అనేవ్యక్తిని బుధవారం గోదావరిఖని సైబర్‌క్రైమ్ పోలీసులు విచారించారు.మార్చి16న సైబర్ క్రైమ్‌పోలీస్‌స్టేషన్‌లో సుమోటో కేసు నమోదైంది. ఈకేసులో బాలు న్యాయవాదితోపాటు బీఆర్ఎస్ నాయకులు కోరుకంటి చందర్, కౌశికహరితోకలిసి సైబర్‌క్రైమ్‌పోలీసుల ఎదుట హాజరయ్యారు. సైబర్‌క్రైమ్ ఎస్‌హెచ్‌ఓ డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో నిందితుడు నల్ల బాలును విచారించారు.

ఆపరేషన్ చేస్తుండగా కార్మికుడి మృతి

● వైద్యుల నిర్లక్ష్యం అంటూ బంధువుల ఆందోళన

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కాలు విరిగి శస్త్రచికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రిలో చేరిన నేతకార్మికుడు ఆపరేషన్ థియేటర్లో కార్డియో అరెస్టుతో మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి సిరిసిల్ల పట్టణంలో చోటు చేసుకుంది. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణం 25వ వార్డు పద్మానగర్‌కు చెందిన బైరి చంద్రయ్య (65)పవర్‌లూం నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వచ్చిన చంద్రయ్య నడుచుకుంటూ రోడ్డుపై కుప్పకూలిపోయాడు. బంధువులు పట్టణంలోని సిరి మల్టీస్పెషల్ ఆసుపత్రిలో చేర్చారు. వైద్యపరీక్షలు చేసిన ఆసుపత్రి వైద్యులు చంద్రయ్యకు తుంటి ఎముక విరిగిందని శస్త్ర చికిత్స(ఆపరేషన్) చేసి రాడువేయాలని సూచించారు. ఆసుపత్రిలో చేరిన నాటి నుంచి వైద్యులు అన్నిరకాల పరీక్షలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం చంద్రయ్య కాలుకు ఆపరేషన్ కోసం ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లారు. ఆసుపత్రిలోని అపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన గంట తరువాత చంద్రయ్యకు పల్స్ పడిపోయిందని, క్రిటికల్‌గా ఉందంటూ వైద్యులు చంద్రయ్య బంధువులకు తెలిపారు. అరగంట తరువాత కార్డియో అరెస్టు అయి చంద్రయ్య మృతిచెందాడంటూ వెద్యులు తెలపడంతో ఆ కుటుంబం షాక్‌కు గురైంది. ఆపరేషన్‌కు ముందు అందరితో మాట్లాడిన వ్యక్తి మృతిచెందాడంటూ వైద్యులు తెలపడంతో వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని ఆందోళన చేపట్టారు. థియేటర్లో ఆపరేషన్ వికటించే మరణించాడంటూ చంద్రయ్య బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. అవాంఛనీయమైన సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడి చంద్రయ్యకు భార్య కనకలక్ష్మి, కుమారులు మహేష్, మనోహర్ ఉన్నారు.



ఆసుపత్రి ఎదుట రోదిస్తున్న బంధువులు, (ఇన్‌సెట్లో)చంద్రయ్య(ఫైల్)

శ్రీనివాస్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చేలా చర్యలు

● దుబాయ్ మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం ● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): దుబాయ్‌లో దారుణంగా హత్యకు గురైన స్వర్గం శ్రీనివాస్ మృతదేహాన్ని స్వదేశానికి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మాజీఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని దమ్మన్నపేటగ్రామానికి చెందిన స్వర్గంశ్రీనివాస్‌ని దుబాయ్‌లో ఓ పాకిస్తానీ దారుణంగా నరికిచంపాడు. మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో మృతుడి భార్య స్వర్గం జమున, కొడుకులు స్వర్గం చందు, సూర్యతో పాటు తల్లి స్వర్గం రాజవ్వను బుధవారం వారు పరామర్శించారు. అనంతరం మృతి వివరాలు అడిగి తెలుసుకుని తల్లి రాజవ్వకు వ్యక్తిగతంగా ప్రభుత్వవిప్ లక్ష్మణ్‌కుమార్ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ద్వారా ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడి శ్రీనివాస్ మృతదేహాన్ని వీలైనంత త్వరలో స్వదేశానికి తీసుకువచ్చే విధంగా కృషిచేస్తామని తెలిపారు. ప్రభుత్వం మృతుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని పేర్కొన్నారు. మృతుని కొడుకు డిగ్రీ చదివి ఉన్నాడని, అవుట్ సోర్సింగ్ జాబ్‌తోపాటు ఇందిరమ్మఇళ్లు, ఎన్ఆర్ఐపాలసీ కింద ప్రభుత్వం తరఫున రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించే విధంగా చూస్తామని అన్నారు. శ్రీనివాస్‌ను హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. వారివెంట టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండలకాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, జిల్లాకాంగ్రెస్ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, పట్టణకాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, మాజీ ఎంపీటీసీ తోడేటి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న విప్ లక్ష్మణ్‌కుమార్, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి

జేఎన్‌టీయూలో జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఆన్‌లైన్ పరీక్షలు

రామగిరి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రహైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జ్యుడిషియల్ మినిస్టీరియల్‌అండ్‌సబార్డినేట్ సర్వీసెస్ ఆన్‌లైన్ పరీక్ష బుధవారం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా ముగిసింది. జూనియర్ అసిస్టెంట్‌పోస్టులకు జరిగిన పరీక్షలో ఉదయం వందమందికి 67మంది, సాయంత్రం56మంది హాజరు కాగా 44మంది హాజరుకాలేదు.. ఎలాంటిఅవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ చంద్రకుమార్, పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



అభ్యర్థుల హాల్‌టికెట్‌లను చూస్తున్న సిబ్బంది

పెంపకానికి ఆరు రోజుల శిశువు

● జయశంకర్ జిల్లా వాసికి ఇచ్చిన మహారాష్ట్ర దంపతులు

● శిశువుకు అనారోగ్యంతో గోదావరిఖని ఆసుపత్రికి

● అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చిన ఆసుపత్రి వర్గాలు

● శిశువు సంరక్షణ చేపట్టిన ఐసీపీఎస్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రకు చెందిన దంపతులు తెలంగాణలోని జయశంకర్ భూపాలపల్లి జిల్లావాసికి ఆరు రోజుల శిశువును పెంపకానికి ఇవ్వడంపై దుమారం నెలకొన్నది. శిశువు అనారోగ్యంతో ఉండడంతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మంగళవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు తీసుకువచ్చారు. శిశువు వివరాలు పొంతన లేకుండా చెప్పడంతో అనుమానం వచ్చిన ఆసుపత్రి సిబ్బంది పోలీస్ అవుట్ పోస్టుకు సమాచారం ఇచ్చారు. దీంతో గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ ఇంద్ర ఇంద్రసేనారెడ్డిలు విచారణ చేయడంతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

మహారాష్ట్ర బల్లార్షకు చెందిన దుర్గం, రవీంద్ర దంపతులు బ్రెడ్ కంపెనీలో కూలీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. ఇప్పటికే వీరికి ముగ్గురు సంతానం. నాలుగవ సంతానం కలుగడంతో పెంపకానికి ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం చెందిన చాంద్‌పాషా తనకు పెంపకానికి శిశువు కావాలని మంచిర్యాలకు చెందిన మ్యారేజీ బ్యూరో నిర్వాహకురాలిని సంప్రదించాడు. ఆమె మహారాష్ట్రలో బ్రెడ్ కంపెనీలో పని చేసే శంకర్ అనేవ్యక్తి ద్వారా దుర్గం, రవీంద్రలను సంప్రదించింది. వారు తమ శిశువును పెంపకానికి ఇచ్చేందుకు అంగీకరించారు. మంగళవారం బల్లార్షా నుంచి శిశువును మంచిర్యాలకు తీసుకువచ్చి జయ, కాటారం చెందిన చాంద్‌పాషాలకు అప్పగించారు. శిశువును కాటారంకు తీసుకెళుతుండగా కదలికలు లేకపోవడంతో మంగళవారం రాత్రి గోదావరిఖనిలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో బుధవారం పోలీసులు మహారాష్ట్ర నుంచి బ్రెడ్ కంపెనీ నిర్వాహకులు, శిశువు తల్లిదండ్రులతోపాటు మంచిర్యాలకు చెందిన జయ, కాటారానికి చెందిన చాంద్‌పాషాలను విచారించారు.

చట్ట విరుద్ధంగా పెంపకానికి తీసుకువచ్చినట్టు గుర్తించారు. పెంపకానికి ఇచ్చిన విషయంలో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు జరుగలేదని ఇరుపక్షాలు పేర్కొన్నాయి. శిశువు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ప్రభుత్వ ఆసుపత్రిలోనే చికిత్స అందిస్తున్నారు. శిశువును పెద్దపల్లి జిల్లా మిషన్ వాత్సల్య(సమగ్ర బాలల పరిరక్షణ పథకం) అధికారుల పర్యవేక్షణకు అప్పగించారు. ప్రస్తుతం శిశువు వారి తల్లిదండ్రుల సంరక్షణలోనే ఉంది.



పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శిశువు

ఉమ్మడి కరీంనగర్ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

కేంద్ర మంత్రులకు బండి సంజయ్ వినతి



కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్ గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసిన బండిసంజయ్‌కుమార్

భగత్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పలు ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, గజేంద్రసింగ్ షేకావత్‌లకు ఢిల్లీలో బుధవారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడి కోసం ప్రత్యే సాయం (ఎస్ఏఎస్‌సీఐ) పథకం కింద నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన గజేంద్ర సింగ్ షేకావత్ ఈ విషయంపై పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని తెలిపారు. సిరిసిల్ల లేదా సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. కేంద్రం సైనిక్ స్కూల్ మంజూరు చేస్తే భూమి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సిరిసిల్ల, హుస్నాబాద్‌లో సైనిక్ స్కూల్ ఏర్పాటు అవకాశాలపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు.

కార్మికచట్టాలు, హక్కులను

కాలరాస్తున్న బీజేపీ ప్రభుత్వం

లేబర్ కోడ్‌ల రద్దుకోసం కార్మికులు పోరాటానికి సన్నద్ధం కావాలి

మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : కార్మిక చట్టాలతోపాటు వారి హక్కులను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని, కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్‌లను రద్దుచేయాలంటూ కార్మికులు పోరాటానికి సన్నద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని శివనగర్‌లో బుధవారం సీఐటీయూ అనుబంధ రంగాలు, యూనియన్‌ల ముఖ్య నాయకులతో వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. బడా పెట్టుబడి దారులకు, కార్పొరేట్లకు కొమ్ముకాసే విధంగా కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 29కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక చట్టాలు, హక్కులను కాలరాస్తోందని మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక 4లేబర్ కోడ్‌ల రద్దుకు దేశంలోని అన్ని జాతీయ,ప్రాంతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా మే 20న చేపట్టే సార్వత్రిక సమ్మెలో జిల్లాలోని కార్మికులు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యులు కోటం రాజు, జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఉపాధ్యక్షుడు మూషం రమేష్, గుర్రం అశోక్, అన్నల్‌దాస్ గణేష్, గురజాల శ్రీధర్, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, గీస బిక్షపతి, మల్యాల నర్సయ్య, సిరిమల్ల సత్యం, జిందం కమలాకర్, రమేష్‌చంద్ర, భారతి, లక్ష్మీ, శ్రీనివాస్, రవి, సురేష్, శేఖర్, రాజు, రమేష్ శ్రీధర్, నర్సయ్య, రాజెల్లయ్య, కుమార్, దేవరాజు, బాబాకిషన్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో సీఐటీయూ జిల్లా వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్

మామిడి రైతుకు మార్కెట్ కష్టాలు



- జగిత్యాలలో ప్రారంభమైన కొనుగోళ్లు
- కమీషన్ ఏజెంట్ల సిండికేట్‌తో నష్టాలు
- నామమాత్రంగా మారిన ఓపెన్ మార్కెట్
- పట్టించుకోని మార్కెటింగ్ శాఖ

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మామిడికి ప్రసిద్ధి గాంచిన జగిత్యాలలో రైతులకు మార్కెటింగ్ కష్టాలు ఎదురవుతున్నాయి. జిల్లాలో మామిడి సాగు అధికంగా ఉన్నప్పటికీ మద్దతు ధర సౌకర్యం లేకపోవడంతో రైతులు ప్రైవేటులో విక్రయించక తప్పడం లేదు. ఈ క్రమంలో వ్యాపారులు సిండికేట్‌గా మారి మామిడి ధరలను అమాంతం తగ్గించేస్తున్నారు. దీంతో మామిడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. హైదరాబాద్, కరీంనగర్, ఇతర ప్రాంతాలతో పోలిస్తే జగిత్యాల మార్కెట్‌లో మామిడికి సరియైన ధర రావడం లేదు. అందుబాటులో ఉన్న ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకే రైతులు పంటను అమ్ముకుంటున్నారు.



మామిడిని ప్యాక్ చేస్తున్న కార్మికులు

కోట్లలో వ్యాపారం

జగిత్యాల మామిడి మార్కెట్ 23 ఎకరాల్లో 2005లో ఏర్పాటు కాగా ప్రతీ సంవత్సరం సుమారు రూ.200 కోట్ల నుంచి రూ.250 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందన్న అంచనా ఉంది. చల్‌గల్ సమీపంలోని వాలంతరీ స్థలాన్ని మార్కెట్‌కు కేటాయించారు. రూ.10 కోట్లతో వ్యాపారులకు షెడ్లు నిర్మించారు. మామిడి కాయల కొనుగోలుకు సుమారు 90 మంది కమీషన్ ఏజెంట్లు, 59 మంది అడ్తిదారులు ఉన్నారు. వీరికి తోడు ఢిల్లీకి చెందిన పలువురు హోల్‌సెల్ వ్యాపారులు జగిత్యాలలో సీజన్ సమయంలో లాడ్జీల్లో తిష్టవేసి కమీషన్ ఏజెంట్ల ద్వారా కొనుగోలు చేసి పలు ప్రాంతాలకు పెద్దఎత్తున తరలిస్తుంటారు. సీజన్‌లో ఇక్కడి నుంచి మామిడి కాయలను పంజాబ్, హర్యానా, ఢిల్లీ, నాగ్‌పూర్, ముంబై వంటి ప్రాంతాలకు రోజూ కనీసం 5 నుంచి 10 లారీల్లో టన్నుల కొద్దీ తరలిస్తుంటారు.

నామమాత్రంగానే ఓపెన్ మార్కెట్

జగిత్యాల మార్కెట్‌లో కమీషన్ ఏజెంట్లు చెప్పిందే ధర అన్నట్టుగా తయారైంది. ఓపెన్ మార్కెట్ నిర్వహిస్తామని అధికారులు చెబుతున్నా అది నామమాత్రమే అన్న ఆరోపణలు ఉన్నాయి. ఒకరిద్దరు కమీషన్ ఏజెంట్లు మినహా ఓపెన్ మార్కెట్‌లో యాక్షన్‌లో ఎవరూ వ్యాపారులు గాని, అడ్తిదారులు గాని, కమీషన్ ఏజెంట్లు గాని భాగస్వామ్యం కావడం లేదు. ఓపెన్ మార్కెట్ అయితే రైతులు తొలుత ఏ వ్యాపారిని సంప్రదించాల్సిన అవసరం లేదు. మామిడి కాయలను తెంపుకొని మార్కెట్‌కు వచ్చి, కాంటా వేసుకొని కుప్పలు పోస్తే లైసెన్స్ పొందిన కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు వచ్చి మార్కెట్ అధికారుల సమక్షంలో కాయ నాణ్యతను బట్టి ధర నిర్ణయిస్తారు. అప్పుడు వ్యాపారుల్లో పోటీ పెరిగి రేటు ఎక్కువ వచ్చే అవకాశాలుంటాయి. ఓపెన్ యాక్షన్‌లో ఢిల్లీ వంటి ఇతర రాష్ట్రాల వ్యాపారులు సైతం పాల్గొంటే రైతులకు మరింత ధర వస్తుంది.



లారీల్లో లోడ్

తెచ్చి కాయలకు ఓ రేటు చెప్పి..తీరా మార్కెట్‌కు తెచ్చి తర్వాత కాయ బాగలేదంటూ రేటు తగ్గిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. దీనికి తోడు క్యాష్ కటింగ్, కమీషన్ కటింగ్ అంటూ వ్యాపారులు దోచుకుంటున్నారని రైతులు అంటున్నారు.

పత్తాలేని మార్కెటింగ్ శాఖ

జగిత్యాల మామిడి మార్కెట్‌లో మార్కెటింగ్ శాఖ అధికారులు మచ్చుకు కూడా కనిపించడం లేదు. చీకటి సమయంలో జరిగే ఈ మార్కెట్‌కు అధి కారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. అది కూడా కింది స్థాయి సిబ్బంది మినహా అధికారులు ఎవరూ రావడం లేదని రైతులు వాపోతున్నారు. జగిత్యాలలో మామిడి మార్కె ట్ సుమారు రాత్రి 8 గంటల సమయంలో ప్రారంభమై అర్ధరాత్రి వరకు కొనసాగుతోంది. నిబంధనల ప్రకారం మార్కె టింగ్‌శాఖ ఉద్యోగుల సమక్షంలో ఓపెన్ మార్కెట్‌లో మామిడి యాక్షన్ జరగాల్సి ఉంటుంది. ఏ రైతు..ఎంత మామిడి సరుకు తీసుకువస్తున్నారు... ఏ కమీషన్ ఏజెంట్లు ఓపెన్ మార్కెట్‌లో అధిక ధర పలికి ఎంత సరుకు కొనుగోలు చేస్తున్నాడు.. రైతులకు రశీదులు... నగదు సరిగా ఇస్తున్నారా.. లేదా అని పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు న్నాయి. మార్కెట్‌లో కాంటా వేయడానికి వసతి లేకపోవ డంతో రైతులు ప్రైవేటు కాంటాలను ఆశ్రయిస్తున్నారు. మార్కెట్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు ధర్మకాంట వద్ద తూకం వేస్తున్నారు. దీనికి గతంలో రూ.40 నుంచి రూ.50 వసూలు చేయగా ప్రస్తుత సీజన్‌లో రూ.80 వరకు వసూలు చేస్తున్నారని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో సాగు ఇలా..

ఉమ్మడి జిల్లాలో సుమారు 75 వేల ఎకరాల్లో మామిడి సాగు అవుతుండగా జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 40 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇందులో అధికంగా జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో మామిడి తోటలున్నాయి. స్థానిక రకాలతో పాటు బంగినపల్లి, దశేరి, హిమాయత్, చిన్న రసాలు, పెద్ద రసాలు, తోతాపురి తదితర రకాలను రైతులు సాగు చేస్తున్నారు. జగిత్యాల మామిడికి ప్రత్యేక గుర్తింపు ఉండడంతో ఇక్కడి పండ్లకు ఢిల్లీ, పుణే, ముంబై, నాగ్‌పూర్ తదితర ప్రాంతాల్లో సైతం గిరాకీ ఉంటుంది. సారవంతమైన ఎర్ర గరప నేలలు, మామిడి కాపు సమయంలో అధిక ఉష్ణోగ్రతలు, పొడి వాతావరణం, గాలిలో తేమ శాతం అతి తక్కువగా ఉండడం, నేలల్లో పొటాష్ తదితర పోషకాలు సమృద్ధిగా ఉండడం, సాగునీటి వసతి, చీడపీడల తీవ్రత తక్కువగా ఉండడం తదితర కారణాలతో జగిత్యాల మామిడికి రుచి, నాణ్యత రీత్యా విపరీతమైన డిమాండ్ ఉంది.

ఢిల్లీ వ్యాపారులతో కుమ్మక్కు

కొన్నేళ్ల క్రితం వరకు జగిత్యాల రైతులు మామిడి పంట అమ్ముకునేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు. 2005లో జగిత్యాలలో మార్కెట్ ఏర్పాటు చేసిన తర్వాత జిల్లా నుంచే కాకుండా నూతనంగా ఏర్పడిన 10 జిల్లాల నుంచి ఈ మార్కెట్‌కు రైతులు మామిడి కాయలను తీసుకువస్తున్నారు. ప్రతీ యేడాది దాదాపు 60 నుంచి 70 టన్నుల మామిడి కాయలు వస్తుంటాయి. జగిత్యాలలో ప్రైవేటు వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతో రైతులకు కొంత మేర ఉపశమనం లభించింది. అయితే స్థానిక వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు కూడా ఢిల్లీ వ్యాపారులతో కుమ్మక్కై ధరలు అమాంతం తగ్గించేస్తున్నారు. ప్రతీ సంవత్సరం సీజన్ ప్రారంభంలో కొన్ని రోజులు అధిక ధరలు పెట్టి ఆ తర్వాత ధరలను తగ్గించేస్తున్నారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఈ సమస్యను పరిష్కారాన్ని మార్కెటింగ్ అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ప్రస్తుత సీజన్‌కు ముందు కిలోకు రూ.100కు పైగా ఉన్న ధరలు, సీజన్ ఆరంభ సమయంలో రూ.70 నుంచి రూ. 80 వరకు పలికాయి. ప్రస్తుత కిలో రూ.35 నుంచి రూ.40 వరకు మంచి రకం మామిడి, రూ.20 నుంచి రూ.30 వరకు ఇతర రకం మామిడికి ధరలు పలుకుతున్నాయి. హైదరాబాద్ గడ్డి అన్నారం, ఢిల్లీ, కరీంనగర్ మార్కెట్‌లతో పోలిస్తే జగిత్యాల మార్కెట్‌లో క్వింటాలుకు రూ.1000 నుంచి రూ.200వ వరకు ధరలు తక్కువగా పలుకుతు న్నాయని రైతులు అంటున్నారు.

కమీషన్ పద్ధతిలోనే అధిక కొనుగోళ్లు

జగిత్యాల మార్కెట్‌లో ఓపెన్ యాక్షన్ ద్వారా కొనుగోలు చేస్తున్నామని అధికారులు, వ్యాపారులు అంటున్నప్పటికీ అధిక కొనుగోళ్లు కమీషన్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. మామిడి కాయల కొనుగోలుకు లైసెన్స్ తీసుకున్న కమీషన్ ఏజెంట్లు మార్కెట్‌లోని షెడ్లల్లో కౌంటర్లు ఏర్పాటు చేసుకున్నారు. రైతులు తాము పండించిన మామిడి కాయల రకాలను తెచ్చి వ్యాపారులకు చూపిస్తే వారు ధర నిర్ణయిస్తున్నారు. కాయలు, రేటు నచ్చితే అక్కడే తూకం వేయిస్తారు. ఈ పద్ధతిలో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వ్యాపారులు ఇష్టారీతిన ధర నిర్ణయిస్తుండడంతో తమకు నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. తొలుత శాంపిల్

అధికారుల పర్యవేక్షణ కరువు

జవ్వాజి గంగాధర్, మామిడి రైతు, తిమ్మాపూర్



జగిత్యాల మార్కెట్‌లో మామిడి కొనుగోలు ఓపెన్ యాక్షన్ ద్వారా నామమాత్రంగానే జరుగుతున్నాయి. మార్కెట్ మొత్తంలో సుమారు 90 మంది వరకు కమీషన్ ఏజెంట్లు ఉండగా ఒకరిద్దరు మాత్రమే ఓపెన్ యాక్షన్‌లో భాగస్వామ్యం అవుతున్నారు. ఓపెన్ యాక్షన్‌ను పర్యవేక్షిం చాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఎక్కువగా మామిడి కొను గోళ్లు కమీషన్ పద్ధతిలోనే జరుగుతున్నాయి. క్యాష్ కటింగ్, కమీషన్ కటింగ్ పేరుతో సుమారు 20 శాతం వరకు కోతలు పెడుతున్నారు. నాణ్యత గల మామిడిని మార్కెట్‌కు తీసుకు వచ్చినప్పటికీ ధరలు సరిగా రావడం లేదు.

ఫిర్యాదులు వస్తే విచారణ చేపడతాం

ప్రకాశ్, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి, జగిత్యాల



చల్‌గల్ మామిడి మార్కెట్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకుంటాం. ఓపెన్ యాక్షన్ ద్వారా అమ్మకాలు జరపాల్సి ఉంటుంది. వ్యాపారులు సిండికేట్ కావడం, ధరలు తగ్గించడం వంటివి జరపకూడదు. మార్కెట్‌లో రైతులకు అవసరమైన వసతులను సమకూర్చాం. రాష్ట్రంలోని హైద్రాబాద్ గడ్డి అన్నారం, కరీంనగర్ వంటి మార్కెట్లలో ఉన్న మామిడి ధరల పట్టికను ప్రతి రోజు జగిత్యాల యార్డులో ప్రదర్శిస్తున్నాం. రైతులు మామిడి విక్రయించిన తర్వాత కమీషన్ ఏజెంట్, వ్యాపారి వద్ద నుంచి రశీదును తీసుకోవాలి.

సోషల్ మీడియాలో వచ్చే సమాచారాన్ని సరిచూసుకోవాలి



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డి

వేములవాడ, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో వస్తున్న సమాచారాన్ని ఒకటికి రెండుసార్లు సరిచూసుకొని వార్తలు రాయాలని రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వేములవాడ పట్టణంలో నిర్మించిన ప్రెస్ క్లబ్ అదనపు సమావేశ మందిరాన్ని స్థానిక శాసన సభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు నిజాలను వెలికి తీసే వార్తలు రాయాలని, ప్రెస్ క్లబ్‌లు జర్నలిస్టుల వృత్తి నైపుణ్యాలను పెంచే కేంద్రాలుగా, ప్రజల సమస్యల పరిష్కారానికి వేదికలుగా మారాలన్నారు. ప్రస్తుతం కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా పెరిగిందని, 30 ఏళ్లుగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మెయిన్ స్ట్రీమ్ మీడియా మొదలుకొని నేడు సోషల్ మీడియా విప్లవం వరకు వచ్చిందని, అయినప్పటికీ సోషల్ మీడియాను వ్యతిరేకించాల్సిన పనిలేదన్నారు.

మెయిన్ స్ట్రీమ్ మీడియాకు జబ్బులు అంటుకున్న విషయాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారని, సమాచార వ్యవస్థ ప్రజలకు సరైన సమాచారాన్ని, వాస్తవాలను అందించాలని కోరారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో నీతి, నియమాలకు అనుగుణంగా పనిచేసే వ్యవస్థ ఉంటుందని, వృత్తి అనుభవం ఉన్న వారు గేటు కీపర్ వ్యవస్థ ఉందని, కానీ సోషల్ మీడియాకు గేట్ కీపర్ వ్యవస్థ లేదన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఏఐతో చేసిన చిత్రాలను చూసి జనాలు చలించిపోయారని, ఏఐ నుంచి ప్రజలను రక్షించడం ఒక ఎత్తని, జర్నలిస్టులుగా వాస్తవాలను తెలుసుకోకుండా సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ఫార్వర్డ్ చేస్తున్నామని, అలా అయితే కేసులు తప్పవని, ఏఐతో జర్నలిస్టులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. వర్కింగ్ జర్నలిస్టుల నైపుణ్యాన్ని పెంచడానికి ప్రెస్ క్లబ్‌లు కృషి చేయాలనీ, సోషల్ మీడియాలో వస్తున్న విషయాలను ఫ్యాక్ట్ చెక్ ఎలా చేయాలో నేర్పించేందుకు ప్రెస్ అకాడమీ సిద్ధంగా ఉందని, అవసరమైతే ఫాక్ట్ చెక్ కోసం వేములవాడలో రెండు రోజుల పాటు ట్రైనింగ్ ఇవ్వడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు జర్నలిస్టులు

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు అని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ప్రెస్ క్లబ్ అదనపు సమావేశ మందిరం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని, అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరలోనే ఇళ్ల స్థలాలు మంజూరు అయ్యేలాగా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, జిల్లా అధ్యక్షుడు దండి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి కాంభోజ ముత్యం, వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వేములవాడ ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లి విద్యారణ్యపురి కాలనీలో ఆర్థిక ఇబ్బందులతో ఎలుకోరు సురేందర్ రెడ్డి(45) బుధవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. సురేందర్‌రెడ్డి కరీంనగర్ సెవెన్‌హిల్స్ ప్రాంతంలో వాటర్ ప్యూరిఫై షాపును నిర్వహిస్తున్నాడు. భార్య మంథని జేఎన్‌టీయూలో ఉద్యోగం చేస్తోంది.

ఉదయం భార్యను మంచిర్యాల బస్టాప్, చిన్న కూతురును స్కూల్‌లో వదిలిపెట్టిన సురేందర్‌రెడ్డి ఇంటికి చేరుకున్నాడు. కూతురు మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసేసరికి సురేందర్‌రెడ్డి ఉరికి వేళాడుతూ కనిపించాడు. జేబులో ఒక సూసైడ్ నోట్ లభించింది. వ్యాపారంలో నష్టం, అప్పుల బాధతో బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు పేర్కొన్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉరేసుకొని చేనేత కార్మికుడు..

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతోపాటు మానసిక సమస్యలతో బాధపడుతున్న కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీ నగర్‌కు చెందిన ఉడుత సుధాకర్ ఉరేసు కొని ఆత్మహత్య చేసుకున్నట్లు కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు. మద్యానికి బానిసగా మారిన సుధాకర్‌కు మానసిక వైద్యుడి వద్ద చికిత్స అందిస్తున్నారు. మంగళవారం ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో పవర్‌లూమ్స్ షెడ్‌లో ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదు

- బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించలేదు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): పసుపు బోర్డుకు చట్టబద్ధత కల్పించలేదని, దీనివల్లే బోర్డుకు బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం బీఆర్ఎస్ వరంగల్ రజతోత్సవ సన్నాహక సమావేశానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పసుపు బోర్డు తెచ్చామని చెబుతున్న బీజేపీ, కేవలం గెజిట్ ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. పసుపు ధరలు పడిపోతే బోర్డు నుంచి రైతులకు డబ్బులు ఇస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ చెప్పారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వడం లేదని ఆమె ప్రశ్నించారు. బీజేపీ ప్రకటించిన విధంగా రెండు కోట్ల ఉద్యోగాలు, పసుపు బోర్డుకు చట్టబద్ధత గురించి తాము అడిగితే నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారన్నారు.

రాష్ట్రం నుంచి 8 మంది కాంగ్రెస్ ఎంపీలు, 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కనీసం ఎనిమిది రూపాయాలు కూడా ఇవ్వలేదని ఆమె ఎద్దేవా చేశారు. కాంగ్రెస్, బీజేపీ చెప్పే మాయమాటలను బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రజలకు వివరించాలని కవిత పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవం గులాబీ పండగ మాత్రమే కాదని, తెలంగాణ పండగ అని చెప్పుకొచ్చారు. కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం ఇస్తామని చెప్పి సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేశారన్నారు. రుణ మాఫీ, రైతు భరోసా 50 శాతం మం దికి ఇప్పటికీ రాలేదన్నారు. ఫ్రీబస్ ఇస్తే బస్సులు పెంచాలా లేదా అని ఆమె ప్రశ్నించారు. తెలంగాణను కాపాడేది కేవలం బీఆర్ఎస్ మాత్ర మేనని కవిత స్పష్టం చేశారు.

జగిత్యాల ఎమ్మెల్యే ఏ పార్టీలో ఉన్నాడో అర్థం కావడం లేదు..

గత శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నడో ప్రజలకు అర్థం కావడం లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఆయన ప్రస్తుతం బీఆర్ఎస్ లోనైతే లేడన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఒకసారి, బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్‌తో ఢిల్లీలో మరోసారి వార్తల్లో కనిపిస్తు న్నాడని విమర్శించారు. బీఆర్ఎస్ చేయి పట్టి నడిపిస్తే సంజయ్ ఎమ్మెల్యే అయ్యాడన్నారు.

ఇటీవల జరిగిన ఓ సర్వేలో జగిత్యాల ఎమ్మెల్యేకు 108వ ర్యాంకు వచ్చిందన్నారు. రోళ్లవాగు ప్రాజెక్టు కడితే 18 నెలల్లో కనీసం గేటు పెట్టలేని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని విమర్శించారు. ఈనెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు క్యాడర్‌ను ఆహ్వానిస్తూ జగిత్యాల తెలంగాణ చౌరస్తాలో నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వాల్ రైటింగ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, రాజేశంగౌడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తదితరులు ప్రసంగించారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి, వేములవాడ, చొప్పదండి తదితర నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జగిత్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

చెరువుల మట్టిపై కన్ను..

(5వ పేజీ తరువాయి)

కుప్పపోశారు. అనుమతులకు మించి మట్టిని తోడారని పలువురు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేయడంతో విచారణ జరిపారు. 60 వేల మెట్రిక్ టన్నుల మట్టికి అనుమతులు తీసుకుంటే 20,280 మెట్రిక్ టన్నుల మట్టిని అదనంగా తోడినట్లు గుర్తించి వారికి నోటీసులు ఇచ్చారు. ఈ విషయమై అనుమతులు పొందిన వారికి ఐదింతల పెనాల్టీలు విధిస్తే వన్ టైం సెటిల్‌మెంట్ ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించి మట్టిని తీసుక వెళుతున్నారు. వాస్తవానికి అధికారులు గుర్తించినట్లుగా అదనంగా తోడిన మట్టి ఇంకా ఎక్కువగానే ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

పెద్దపల్లి మండలం కొత్తపల్లి చెరువులో ఆరు ఇటుక బట్టీలకు చెందిన యజమానులు 70,216 మెట్రిక్ టన్నుల మట్టి కోసం అనుమతులు తీసుకుని 95,294 టన్నుల మట్టిని అదనంగా తోడినట్లు నీటి పారుదల శాఖాధికారులు గుర్తించారు. చెరువు పక్కనే ఆ మట్టిని నిల్వ చేయగా, నెల రోజుల క్రితం గుట్టుచప్పుడుగా ఆ మట్టిని తరలించేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు గుర్తించి అధికారులకు సమాచారం ఇచ్చారు. అదనంగా తోడుకు పోయిన మట్టికి పదింతలు సుమారు 38 లక్షల 56 వేల రూపాయల జరిమానా విధించారు. వన్‌టైం సెటిల్‌మెంట్ కింద రెండింతలు చెల్లించేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఆ డబ్బు ఇప్పటి వరకు బట్టీల యజమానులు చెల్లించకపోవడంతో గనులు, భూగర్భ శాఖాధికారులు సీజ్ చేశారు.

● జిల్లాలో 14 చెరువుల గుర్తింపు..

ఈ యేడు చెరువుల్లో మట్టిని తరలించేందుకు అనుమతులు ఇచ్చేందుకు నాలుగు మండలాల్లో 14 చెరువులను గుర్తించారు. ఈ చెరువుల నుంచి 3 లక్షల 8 వేల క్యూబిక్ మీటర్ల పూడిక మట్టి తీసుక వెళ్లేందుకు అవకాశం ఉందని నీటి పారుదల శాఖాధికారులు గుర్తించారు. కాల్వశ్రీరాంపూర్ మండలం తారుపల్లి నక్కల ఒర్రె ప్రాజెక్టులో 40 వేల క్యూబిక్ మీటర్లు, పందిళ్ల పెద్ద చెరువులో 20 వేల క్యూబిక్ మీటర్లు, పెగడపల్లి పెద్ద చెరువులో 60 వేల క్యూబిక్ మీటర్లు, మంగపేట నల్ల చెరువులో 10 వేల క్యూబిక్ మీటర్ల మట్టి, ధర్మారం మండలం ధర్మారం సీతల చెరువులో 30 వేల క్యూబిక్ మీటర్లు, సర్సింగాపూర్ చిన్న చెరువులో 40 వేల క్యూబిక్ మీటర్లు, దొంగతుర్తి పెద్ద చెరువులో 40 వేల క్యూబిక్ మీటర్ల మట్టి ఉందని గుర్తించారు. జూలపల్లి మండలం తేలుకుంట రామప్ప చెరువులో 15 వేల క్యూబిక్ మీటర్లు, దారం చెరువులో 5 వేల క్యూబిక్ మీటర్లు, కాచాపూర్ ఇయ్యావు చెరువులో 10 వేల క్యూబిక్ మీటర్లు, కుమ్మరికుంటలోని పోచమ్మకుంటలో 5 వేల క్యూబిక్ మీటర్లు, ఓదెల మండలం కనగర్తి మెట్టిపల్లి చెరువులో 2 వేల క్యూబిక్ మీటర్లు, కొలనూర్ అలీమయ్య చెరువులో వెయ్యి క్యూబిక్ మీటర్ల మట్టి తరలించుకు పోయేందుకు అవకాశం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ చెరువుల్లో మట్టి తరలింపునకు ఇటుక బట్టీల యజమానుల పేరిట అనుమతులు పొందేందుకు అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు అప్పుడే యత్రాలు మొదలు పెట్టారు. ఏదీ ఏమైనా మట్టి తరలింపులో అధికారులు, అనుమతులు పొందిన వాళ్లు పారదర్శకంగా వ్యవహరిస్తేనే అక్రమాలకు తావుండదు.

ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు



అక్రమ కట్టడాలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

ధర్మారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి కట్టడాలు నిర్మిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని తహసీల్దార్ ఎండీ వకీల్ హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలోని సర్వేనంబర్ 476లో నిర్మించిన అక్రమ కట్టడాలను ఎక్స్‌కావేటర్‌తో తొలగించి ప్రభుత్వ భూమిని స్వాధీన పరచుకున్నారు. భూ ఆక్రమదారులు నాలుగు ప్రదేశాలలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టగా వాటిని తొలగించి మొత్తం 24 గుంటల ప్రభుత్వ భూమిని స్వాధీన పరుచుకున్నట్లు తహసీల్దార్ తెలిపారు. గిర్దావార్‌లు వరలక్ష్మి, నవీన్, రెవెన్యూ సిబ్బంది సాగర్, రాజయ్య, కర్నాకర్ తిరుపతి పాల్గొన్నారు.

నిరుపేద యువతి వివాహానికి పుస్తెమట్టెలు

ఓదెల ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రుద్రోజు రవీంద్ర చారి, సరస్వతి దంపతుల మూడో కుమార్తె వివాహానికి బుధవారం స్వర్ణకారుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పుస్తె, మట్టెలను అందజేశారు. జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాసచారి, శ్రీరామోజు రాజు, కొండపాక నరసింహాచారి, వెలుశోజు రవీందర్, దేవరకొండ సతీష్, విలుశోజు శ్రీనివాస చారి, వెలుశోజు శ్రీధర్ తో పాటు పాల్గొన్నారు.

కాంగ్రెస్ శ్రేణుల రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): పట్టణ కాంగ్రెస్ శ్రేణులు బుధవారం కాలనీలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వహించాయి. 18వ డివిజన్‌లో పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు మారెల్లి రాజిరెడ్డిలు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రతో పాలన సాగిస్తున్నట్టు ఆరోపించారు. దేశ పౌరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించే విధంగా నల్ల చట్టాలను అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. దేవనపల్లి చక్రపాణి, కేశవులు, ఓదేలు, రాకేష్, అజయ్, అఫ్సర్, దేవేందర్, బాదె రాజు, రమేష్, రాములు, అక్షయ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్, సిబ్బంది

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం గోదావరిఖని మార్కండేయకాలనీలోని అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ ఆఫీసర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఇంట్లో గ్యాస్ సిలిండర్లు మంటలు అంటుకున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ సిలిండర్‌పై తడి గోనె సంచి, బకెట్ కానీ పెట్టి మంటలు అదుపు చేయవచ్చని తెలిపారు. ఫైర్‌మెన్లు రాజేశం, శ్రీనివాస్, అశోక్, శ్రీనివాస్, వివేకానంద, చందు పాల్గొన్నారు.

ఆరుగాలం కష్టం.. వర్షార్పణం

(5వ పేజీ తరువాయి)

కన్నీటిని మిగిల్చింది. జీలకుంట, శానగొండ, రూపునారాయణపేట, గొల్లపల్లి, ఇందుర్తి, బ్రాయమ్మపల్లి, గూడెం, గుంపుల గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన వడగండ్ల వర్షంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వడగండ్ల వర్షంతో 293 మంది రైతులకు చెందిన దాదాపు ఆరు వందల ఎకరాల్లో సీడ్, లోకల్ రకాల ధాన్యం నేల పాలైంది. ఉధృతంగా వీచిన గాలితోపాటు రాళ్ల వర్షానికి వరి కర్రపై ఉన్న ధాన్యం గింజ లేకుండా రాలి పోయింది. దాదాపు ఎకరం సీడులో 85 శాతం ధాన్యం చేతికందకుండా పోయింది. అలాగే మరో రెండు రోజుల్లో పంటలను పూర్తి చేసుకునే సమయంలో గాలి, వడగండ్ల వాన సృష్టించిన బీభత్సానికి రైతులు ఆర్థిక నష్టానికి గురయ్యారు. ఏవో భాస్కర్, ఏఈవోలు దెబ్బతిన్న వరి పంటలను పరిశీలించారు. ఏవో విలేకరులతో మాట్లాడుతూ, పూర్తి స్థాయిలో సర్వే చేసి నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు.

ఆత్మహత్యే శరణ్యం



మాధనవేని కుమారస్వామి గొల్లపల్లి

ఐదు ఎకరాల్లో గంగ కావేరి రకం వరి పంటను సాగు చేసిన, తెల్లారితే పంట కోయించేందుకు సిద్ధం చేసు కున్న. ఇంతలో వడగండ్ల వానతో పూర్తిగా ధాన్యం నేల పాలయింది. దీంతో రూ.3.60 లక్షల మేరకు నష్టాలకు గురైన, ప్రభుత్వం ఆదుకోవాలి.

కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): భారీ గాలులు, వర్షానికి పలు గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. మామిడి కాయలు నేలరాలి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు పంటలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. హార్టికల్చర్ అధికారి మహేష్ మామిడి తోటలను బుధవారం పరిశీలించారు. మామిడి తోటలు నష్టపోయిన రైతుల వివరాలను హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు నమోదు చేసుకొన్నారు. మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య ఉన్నారు.



బేగంపేట్‌లో నెలకొరిగిన వరిపైరు

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో భారీ వర్షం కారణంగా బేగంపేట్ గ్రామంలో పలు చోట్ల వరి పైరు నెలకొరిగింది. గ్రామానికి చెందిన రామిడేని బక్కయ్యకు చెందిన సుమారు 5 ఎకరాల వరి పైరు పూర్తిగా నెలవాలింది. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.



ఓదెల మండలం శానగొండలో గింజ లేకుండ ఉన్న సీడ్ పొలం

ముత్తారం మండలంలో భారీ నష్టం

ముత్తారం, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెండు గంటలపాటు కురిసిన భారీ ఈదురుగాలుల, రాళ్ళవానతో భారీ నష్టం వాటిల్లింది. సీడ్ రైతులను అతలాకుతలం చేసింది. రెండు రోజుల్లో కోతల సమయం ఉండగా మంగళవారం రాత్రి కురిసిన వర్షం సీడ్ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఓడేడు, అడవి శ్రీరాంపూర్, ముత్తారం, ఖమ్మంపల్లి, పారుపల్లి గ్రామాల్లో సుమారుగా 6 వేల ఎకరాల్లో సీడ్ పంటను సాగు చేస్తే 4 వేల ఎకరాలలో పంట నేలమట్టమైంది.

రెండు రోజుల్లో పంటను కోసి సీడ్ కంపెనీ ఇచ్చే సమయంలో వర్షం నట్టేట ముంచింది. ఎకరానికి సుమారుగా రూ లక్ష యాభై వేల ఆదాయాన్ని పొందే అవకాశం ఉండేది. కనీసం రూ. పదివేలు ఆదాయం కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలకు కంపనీలు పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

కన్నీళ్లే మిగిలాయి



నామిని ప్రశాంత్, అడవి శ్రీరాంపూర్

సీడ్ కంపెనీల ద్వారా రైతులకు అధిక దిగుబడి వస్తుందని 5 ఎకరాల్లో సాగుచేశా. కోత కొచ్చే సమయంలో రాళ్ల వాన నష్టం చేసింది. వేల రూపాయలు కూలీలను పెట్టి సీడ్ కంపెనీ వారు చెప్పిన విధంగా చేస్తే రాళ్ల వాన పంట ను నాశనం చేశాయి. దీంతో సుమారుగా 6 లక్షలనష్టం వాటిల్లింది వర్షం కన్నీళ్లే మిగిల్చాయి

ప్రభుత్వం ఆదుకోవాలి



దైగంటి సంతోష్, అడవి శ్రీరాంపూర్

సీడ్ కంపెనీ ద్వారా ఆడ, మగ పంటలను సాగు చేశా. చేతికందే సమయంలో రాళ్ళవాన నష్టం చేసింది. ప్రభుత్వమే ఆదుకోవాలి. సీడ్ కంపెనీ వారు ఆదిలాబాద్ జిల్లాలో నష్టపరిహారం ఇచ్చిన విధంగా ఇక్కడ కూడా ఇచ్చేలా ప్రభుత్వం ఒత్తిడి చేయాలి.

27న గ్రామాల్లో గులాబీ జెండా రెపరెపలాడాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

మంథని, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ సందర్భంగా గ్రామ గ్రామాన గులాబీ జెండా రెపరెపలాడాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇంచార్జి పుట్ట మధు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నివాసంలో డివిజన్‌లోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్‌పూర్ మండలాల్లోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించి సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ గొప్ప ఆశయం కోసం ఆవిర్భవించి రాష్ట్రాన్ని సాధించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలు నుంచి పాలన పరమైన నిర్ణయాలకు అభాసుపాలవుతుందని విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధింపులకు గురి చేస్తే సహించేది లేదన్నారు. తగరం శంకర్ లాల్, మాచీడి రాజుగౌడ్, పొతిపెద్ది కిషన్‌రెడ్డి, కనవేన శ్రీనివాస్, పూదరి సత్యనారాయణగౌడ్, శంకేషి రవీందర్, కుమార్‌లు పాల్గొన్నారు.

కోల్‌సిటీ, (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవాలను విజయవంతం చేయాలని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రజల ఆశయాలను నెరవేర్చిన నాయకుడు కేసీఆర్ అన్నారు. రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి) వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు పూస్కూరి జితేందర్‌రావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. పూస్కూరి రామారావు, కాంపెల్లి చంద్రశేఖర్, తుమ్మల రాంబాబు, కూరపాటి శ్రీనివాస్, ఎండీ రఫీ, సల్వాజీ మధవరావు, ఆవుల లత, దేవి లావణ్య, వనిత, మోకనపల్లి రాజమ్మ, నర్సయ్య, పాల్గొన్నారు.

జ్యోతినగర్, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందన్ అన్నారు. వరంగల్‌లో జరిగే పార్టీ రజోత్సవ సభకు సంబంధించి బుధవారం ఎన్టీపీసీ బీఆర్ఎస్ పట్టణ కమిటీ సమావేశమైంది. చందర్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన గులాబీ జెండాతోనే సాధ్యమైందన్నారు. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ ప్రజల వెంట ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్, కేసీఆర్ మాత్రమే ప్రజలకు శ్రీరామరక్ష అని అన్నారు. నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు సభకు తరలి రావాలని కోరారు. బుర్ర శంకర్‌గౌడ్, కౌశిక హరి, మాజీ కార్పొరేటర్లు రమణారెడ్డి, శ్రీనివాస్, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆర్మీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కోల్‌సిటీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ అయ్యే అభ్యర్థులు ఆర్మీ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ ఎం రమేష్ సూచించారు. సీఈఆర్ క్లబ్‌లో అగ్ని వీర్ రిక్రూట్‌మెంట్‌కు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను ఏసీపీ రమేష్, వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డిలు అందించారు. ఏసీపీ మాట్లాడుతూ అగ్నివీర్ ద్వారా సైన్యంలోకి వెళ్లాలనే ఆసక్తితో అభ్యర్థులు సిద్ధమవుతున్నారన్నారు. వీరికి రిటైర్డ్ ఆర్మీ జవాన్ల పర్యవేక్షణలో రన్నింగ్, మెడికల్, ఇతర ఫిజికల్ టెస్టులకు సంబంధించి శిక్షణనిస్తున్నామని, రాత పరీక్షలకు సంబంధించి నిపుణులతో శిక్షణ నిస్తున్నామన్నారు. సీఐ ఇంద్రసేనారెడ్డి, శిక్షణ కార్యక్రమం ఇన్‌చార్జి మహిపాల్‌రెడ్డి, పాల్గొన్నారు.

రేషన్ డీలర్లతో సమావేశం

జూలపల్లి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రేషన్ డీలర్లతో తహసీల్దార్ జక్కని స్వర్ణ సమావేశం నిర్వహించారు. డీలర్లు సమయపాలన పాటించాలన్నారు. ఉద్యోగులు, డీలర్లు పాల్గొన్నారు.

దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బొంతల రాజేష్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): దేశంలో మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య విచ్ఛిన్న పాలనకు బీజేపీ పాల్పడుతుందని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, పట్టణ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆరోపించారు. బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ జోడో యాత్ర పేరుతో దేశ వ్యాప్తంగా యాత్ర నిర్వహించి పేద ప్రజల సమస్యలు తెలుసుకొన్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీ కుల గణన చేసింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. ఇది చూడలేక బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు విష ప్రచారం చేస్తున్నారని, జేపీపీ పాలిత రాష్ట్రాల్లో సన్నబియ్యం పంపిణీ, రైతులకు రుణా మాఫీ ఇచ్చిందా అని ప్రశ్నించారు. గచ్చిబౌలి భూములపై బుల్డోజర్ పెడుతున్నారంటూ ప్రధాని నరేంద్ర మోదీ అసత్యఆరోపణలు చేస్తున్నారన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులను బయటకు తీసి సోనియాగాంధీ, రాహుల్ గాంధీని బీజేపీ ప్రభుత్వం వేధిస్తుందని, మూతపడిన పత్రికకు నిధులు మళ్లించారంటూ కేసులు నమోదు చేయడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ నాయకులు దీటి బాలరాజు, యాకూబ్ అల్లి శంకర్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కన్నాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మెన్ బయ్యపు మనోహర్‌రెడ్డి రైతులకు సూచించారు. బుధవారం రాణాపూర్, భామ్లానాయక్‌తండా, కన్నాల, జీడినగర్, ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండెడ గ్రామాల్లో కన్నాల సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. సన్న రకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ చెల్లిస్తుందని పేర్కొన్నారు. కేంద్రాల నిర్వాహకులు రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరించాలని, నీడ కోసం టెంట్, తాగునీటి వసతి ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. డైరెక్టర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, పాల్గొన్నారు.

మంథనిరూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎక్లాస్‌పూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం అధికారులు ప్రారంభించారు. కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంచార్జి తహసీల్దార్ గిరి, ఏడీఏ అంజనీ, ఏపీఎం పద్మ, సీసీ అనసూర్య, మహిళా సంఘం అధ్యక్షురాలు భారతి, రైతులు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): ఐకెపి సెంటర్లలోనే ధాన్యం విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని ఏపీఎం స్వరూపరాణి రైతులను కోరారు. బేగంపేట్, కల్వచర్ల, రత్నాపూర్, రాజాపూర్, లొంకకేసారం, లద్నాపూర్, నవాబ్‌పేట్ గ్రామాలలో ఐకెపి, సహకార సోసైటి ఆధ్వర్యంలో కొనుగొలు కేంద్రాలను ప్రారంభించారు. డీపీఎం నాగేశ్వర్‌రావు, ఏవో శ్రీకాంత్, సీసీలు శంకర్, బాపు, శోభ, పాల్గొన్నారు.

సుల్తానాబాద్, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించాలని కేడీసీసీబీ డైరెక్టర్ దేవరనేని మోహన్ రావు రైతులకు సూచించారు. చిన్నకలువల సహకార సంఘం ఆధ్వర్యంలో దేవునిపల్లి, కొదురుపాక, నారాయణపూర్, చిన్నకలువలలో గురువారం ఎమ్మెల్యే కేంద్రాలను ప్రారంభిస్తారన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు చెల్లించాలి

కాల్వశ్రీరాంపూర్ ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్ల మూడు నెలల జీతాలు చెల్లించాలని బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీవో పూర్ణచందర్ రావుకు, తహసీల్దార్ జగదీశ్వరరావుకు ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి పత్రం అందజేశారు. ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు మాట్లాడుతూ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఒకే జీతానికి పనిచేస్తున్నామని, ప్రభుత్వం ఏ విధమైన అలవెన్సులు ఇవ్వడం లేదన్నారు. రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే అన్ని సౌకర్యాలు కల్పించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, రాజిరెడ్డి, శంకర్, సంపత్, పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దకల్వల గ్రామానికి చెందిన దేవనంది భూదమ్మ ఇటీవల మృతిచెందగా బుధవారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీఆర్ఎస్ నాయకులు బండారి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

మహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలు

మంథని, ఏప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మంత్రపురి శ్రీమహాగణపతి ఆలయంలో చతుర్థి వేడుకలను భక్తులు బుధవారం వైభవంగా నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకొని మహాగణపతి స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకుడు పల్లి రాముశర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తి శ్రద్ధలతో పూజించారు.

రేణుక ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఆదివారంపేట్ గ్రామంలో రేణుక ఎల్లమ్మతల్లిని బుధవారం శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మంథని నియోజకవర్గ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు వినతి

రామగిరి, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): ఫీల్డ్ అసిస్టెంట్ సమస్యలను పరిష్కారించాలని బుధవారం మండలంలోని ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎంపీడీవో శైలజారాణికి వినతి పత్రం అందజేశారు. మూడు నెలలుగా వేతనాలు రావడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉద్యోగ భద్రతతోపాటు పేస్కేల్ వేతనం కల్పించాలని వినతి పత్రం అందజేశారు.

ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత

పెద్దపల్లిటౌన్, ఎప్రిల్ 16 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యల నివారణ సామాజిక బాధ్యత అని ఆత్మహత్యల నివారణ కమిటీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. బుధవారం పెద్దపల్లిలో ఆత్మహత్యల నివారణ కమిటీ, సైకాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. అశోక్ మాట్లాడుతూ ఆత్మహత్య ప్రయత్నం చేసుకునే వ్యక్తులకు మానసిక ధైర్యాన్ని నింపాలన్నారు. ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తూ ఇప్పటివరకు 28 మందిని కాపాడటం అభినందనీయమన్నారు. కోమటిపల్లి సదానందం, సరోజ, సుబ్బు సతీష్ శ్రీనివాస్, కన్నం శ్రావణ్, ఆడెపు రాజేంద్రప్రసాద్,రామకృష్ణ, కమలాకర్, పాల్గొన్నారు

సింగరేణి విశ్వవ్యాప్త విస్తరణకు నైనీ గని తొలిమెట్టు



నైనీ గనిని వర్చువల్ ద్వారా ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

గోదావరిఖని, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఒడిశా రాష్ట్రంలో నైనీ గని ప్రారంభంతో సింగరేణి విశ్వవ్యాప్త విస్తరణకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బుధవారం మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్ నుంచి ఆయన ఒడిశా రాష్ట్రంలో సింగరేణి చేపట్టిన నైనీ బొగ్గు బ్లాక్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఒడిశాలో గని ప్రారంభించడం సింగరేణి సంస్థకే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి ఒక ఆనందకరమన్నారు. ప్రభుత్వం చూపిన ప్రత్యేక చొరవ వల్లే ఏడాదిలోనే దీనిని ప్రారంభించుకోవడం ప్రజా ప్రభుత్వానికి సింగరేణి అభివృద్ధిపై ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. త్వరలో సింగరేణి గ్లోబల్ కంపెనీగా రూపుదిద్దుకోనుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నైనీ గని ప్రారంభానికి సహకరించిన కేంద్ర బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డి, ఒడిశా ప్రాంతానికి చెందిన కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ, స్థానిక ఎమ్మెల్యే అగస్తీ బెహరా, ఇతర ప్రజాప్రతినిధులకు మంత్రి భట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపారు.

అంగూల్ ప్రాంత ప్రజల ఉపాధి అవకాశాలు మరింతగా మెరుగుపరచడం కోసం 1600 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని కూడా నైనీకి సమీపంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, దీనికి సంబంధించిన స్థల సేకరణకు ఒడిశా ప్రభుత్వం సహకరించాలని ఆయన కోరారు. రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ ఒడిశాలో సింగరేణి బొగ్గు గని ప్రారంభించడం ఒక చరిత్రాత్మక సందర్భమని, ఇది సింగరేణి అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. బొగ్గు గని ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సీఎండీ బలరాంలకు అక్కడి ఎమ్మెల్యే అగస్తీ బెగరా శుభాకాంక్షలు తెలి పారు. సింగరేణి సంస్థ సీఎండీ ఎన్ బలరామ్ మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ, సహకారం వలన నైనీ బొగ్గు బ్లాక్‌ను ప్రారంభించుకోగలిగామన్నారు. ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్, ఓఎస్డీ సురేందర్ రెడ్డి, పాల్గొన్నారు.



చెరువుల ఏర్పాటుకు స్థలాల పరిశీలన

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): నీటి బిందువు జల సింధువులో భాగంగా ఆర్జీ-2 ఏరియా పరిధిలో కార్పొరేట్ అధికారులు బుధవారం పర్యటించారు. చెరువుల ఏర్పాటుకు అనువైన స్థలాలను అధికారుల బృందం పరిశీలించింది. సింగరేణి వ్యాప్తంగా భూగర్భ జలాల అభివృద్ధికి చెరువులు, కుంటలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు జీఎం ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ సైదులు పేర్కొన్నారు. చెరువులు, కుంటలను అభివృద్ధి చేయడం ద్వారా భూగర్భ జలాల నీటి మట్టం పెరుగుతుందని, తద్వారా సింగరేణి ఉద్యోగులతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు తాగు, సాగు నీటికి ఇబ్బందులు లేకుండా ఉంటుందని సైదులు తెలిపారు. స్థలాలను పరిశీలించిన అధికారుల బృందంలో సింగరేణి సివిల్ జీఎం సూర్యనారాయణ, ఆర్జీ-2 సివిల్ డీజీఎం ధనుంజయ, పర్యావరణ అధికారి సురేష్‌బాబు, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, సివిల్ ఈఈ వినయ్‌సాగర్, ఫారెస్ట్ అధికారి నవీన్‌కుమార్ ఉన్నారు.

ఈనెల 25న చలో హైదరాబాద్

కాల్వశ్రీరాంపూర్. ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): 317జీవో రద్దుకు ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఉద్యోగ సంఘం నాయకులు కూరపాటి సత్య ప్రకాశరావు తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం వచ్చిన తర్వాత 48 గంటల్లోనే 317 జీవో రద్దు చేసి గతం మాదిరిగానే ఉద్యోగాలు ఇస్తామని పేర్కొందన్నారు. ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. ఈ జీవో కారణంగా సుమారు 54 మంది ఉద్యోగులు ప్రాణాలు కూడా కోల్పోయారన్నారు. భార్య ఒకచోట భర్త ఒకచోట ఉండడం వలన పిల్లలకు కుటుంబానికి దూరమవుతున్నామని, ఈ విషయంపై ప్రభుత్వం స్పందించాలన్నారు.

రాజీవ్ స్వగృహలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

అంతర్గాం, ఏప్రిల్ 16(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లిలో గల రాజీవ్ స్వగృహ కాలనీలో బుధవారం హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు మురళీధర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలనీ వాసులు అత్యంత భక్తి శ్రద్ధలతో స్వామి వారికి పసుపు, కుంకుమ, పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. వీరన్న, రాజ గోపాల్ గౌడ్, రాజేంద్ర ప్రసాద్, రాజలింగం, మల్లికార్జున రావు, రవి, సతీష్ పాల్గొన్నారు.